దారి పొడవునా డెబ్రిస్


ప్రధాన రహదారిలో బార్ పక్కన గుట్టలుగా పడేసిన భవన నిర్మాణ వ్యర్థాలు


బార్ పక్కనే షెడ్డు వద్ద డెబ్రిస్ కుప్పలు

- ఎన్‌జీజీవోస్ కాలనీ – కైలాసపురం రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాల గుట్టలు
- ఎవరు డంప్ చేస్తున్నారో తెలియని వైనం
- నెలలుగా కానరాని తొలగింపు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

మద్రిపాలెం: స్థానిక ప్రధాన రహదారి డెబ్రిస్‌కు నిలయంగా మారి డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీంతో స్థానికులు, ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. 48 నంబర్ బస్ రూట్‌లో 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ నుంచి బర్మా కాలనీ, కైలాసపురం ప్రాంతాలకు వెళ్లే మెయిన్ రోడ్డులో అర కిలోమీటర్ మేర భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా డంప్‌చేస్తున్నారు. కొన్ని నెలలుగా అవి దారంతా పడి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎక్కడి నుంచో వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడి దారిలో పడేస్తున్నా.. కనీసం పట్టించుకునే నాథుడే లేడని, తమ ప్రాంతంలో ఎందుకు పడేస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతం మెయిన్ రోడ్డులో ఓ రెస్టారెంట్ అండ్ బార్ ఉంది. దాని పక్క నుంచి మొదలుకుని అర కిలోమీటర్ మేర దారంతా భవన నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయింది. బార్ వద్ద డెబ్రిస్ మీద కొందరు కూర్చుని మద్యం తాగుతూ మత్తులో తూలుతున్నారని, తాగిన మద్యం సీసాలు, గ్లాసులు పడేస్తున్నారని స్థానికులు అంటున్నారు. నెలలు గడుస్తున్నా.. ఈ వ్యర్థాలను తరలించడానికి ఇక్కడికి ఎవరూ రావడం లేదు. అసలు ఇది పోర్టు వారు తీస్తారా లేక జీవీఎంసీ వారు తొలగిస్తారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కొందరు పోర్టుకు సంబంధించినదిగా చెబితే.. మరికొందరు తెలియదని విచిత్రమైన సమాధానాలు చెబుతున్నారు.

రాత్రి వేళల్లో డంపింగ్

బార్ పక్కనే ఓ షెడ్డు నిర్మించి వదిలేశారు. పోర్టు వారు ఎవరికో లీజుకు ఇచ్చినట్టు, అది కట్టి వదిలేసినట్టు చుట్టుపక్కల నివాసులు చెబుతున్నారు. షెడ్డు నిర్మాణం కోసం సదరు నిర్మాణదారుడు షెడ్డు ముందు ప్రాంతాన్ని రోడ్డుకు సమాంతరంగా చదును చేసే క్రమంలో ఇలా కొంత వ్యర్థాలను వేసి ఆపేశారని, అది అలవాటైన మరికొందరు అప్పటి నుంచి అక్కడ భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తూనే ఉన్నారని పలువురు స్థానికులు అంటున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి డెబ్రిస్‌ను రాత్రి పూట ఎవరూ లేని సమయంలో తెచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారని చెబుతున్నారు. మందుబాబులు అక్కడే తాగి పడిపోతున్నారని, అటుగా వెళ్లేందుకు భయంగా ఉందని వాపోతున్నారు. మరోపక్క కాలనీవాసులు ఇళ్లలో చెత్తను పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు ఇవ్వకుండా తమకు నచ్చిన సమయంలో ఆ రోడ్డులో ఎక్కడో అక్కడ పడేసి వెళ్లిపోతున్నారు. ఇలా ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌లు చేసే దగ్గర వాటి మధ్యలో పడేస్తున్నారు. ఇటీవల ఎండలు బాగా ఉండటం వల్ల వ్యర్థాలు పొడిగానే ఉంటున్నాయి. ఇప్పుడు వర్షాలు పడుతుండటం వల్ల దుర్గంధం వస్తోందని, తద్వారా రోగాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వాహనాల మధ్య పడేసిన చెత్త

అధికారులు చర్యలు చేపట్టాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరమంతటా రోడ్లు నిర్మించారని, ముఖ్యంగా ఉత్తర నియోజకవర్గంలో 48 బస్ రూట్‌ను చాలా శుభ్రం చేయించారని, అప్పటి నుంచి ఈ మార్గంలో రాకపోకలు సజావుగా సాగుతున్నాయని, ఇప్పుడు దాన్ని కూడా కొందరు పాడుచేస్తున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఆ పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహాయంతో, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు వార్డును చక్కగా తీర్చిదిద్దారని, ఇప్పుడు నాయకులు కనీసం ప్రజల్లోకి రాకుండా ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి డెబ్రిస్ తొలగింపునకు, మళ్లీ డంప్ చేయకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

విషయం తెలియదంటున్న సచివాలయ అధికారి

ఈ వ్యర్థాల విషయమై సంబంధిత సచివాలయ అధికారిని 'సాక్షి' వివరాలు కోరగా.. తనకు తెలియదని బదులిచ్చారు. ట్యాక్స్ కలెక్టర్ కమ్ అడ్మిన్ హోదాలో విధులు నిర్వరిస్తూ ఉన్న అధికారి పరిధి కాకపోతే తమ పరిధి కాదని చెప్పాలే కానీ ఇక్కడ మాకు తెలియదు, ఐడియా లేదని అనడం విడ్డూరంగా ఉంది. నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడమనేది కనీస బాధ్యత. డెబ్రిస్ సమస్యను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.


అదే రోడ్డులో డెబ్రిస్ కుప్పలు

చురుగ్గా వాకింగ్ ట్రాక్ పనులు


ట్రాక్ పనులను పర్యవేక్షిస్తున్న భానుప్రకాష్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో జీవీఎంసీ నిధులతో నిర్వహిస్తున్న మట్టి వాకింగ్ ట్రాక్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీని నిర్మాణానికి రూ.19.90 లక్షలు మంజూరైన మేరకు ఇటీవల శంకుస్థాపన చేశారు. బుధవారం పాత సిమెంట్ ట్రాక్‌ను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. వీటిని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, కార్యదర్శి సీహెచ్‌ఎస్ఎస్‌వీ ప్రసాద్, సహ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు పర్యవేక్షించారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నందున నెల రోజుల పాటు ట్రాకుపై వాకింగ్ నిలిపివేస్తున్నామని, వాకర్స్ సహకరించాలని భానుప్రకాష్ కోరారు. సందర్శకులు యథావిధిగా పార్కుకు రావచ్చని చెప్పారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం చేనేత హస్తకళా ప్రదర్శనను బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక రిబ్బన్ కట్‌చేసి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా కార్మికులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. ఈ నెల 29 వరకు ప్రదర్శన కొనసాగుతుందని, అనేక రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన వివిధ వస్త్రాలను ఇక్కడ విక్రయిస్తున్నారని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సంపత్ వినాయగర్'కు విరాళం

దాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

క్లుప్తంగా

లలితా పీఠంలో జేష్ట పౌర్ణమి పూజలు


అభిషేక సేవలో కల్యాణ వేంకటేశ్వరుడు

సీతంపేట: జేష్ట పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో బుధవారం కల్యాణ వేంకటేశ్వర స్వామికి అభిషేకం జరిపించారు. పండితుల వేదమంత్రాల మధ్య పంచామృతాలు, పసుపు, కుంకుమ, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్రాలు, పూలమాలలు, ఆభరణాలతో అలంకరించి విశేష హారతులిచ్చారు. దూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించి అభిషేకాలు జరిపారు. వారికి ప్రసాదం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడి ఆలయంలో ఏరువాక పున్నమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏరువాక పూర్ణిమ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీవారికి పుష్పాంజలి సమర్పించారు. వివిధ రకాల ఫలాలు, పత్రాలను భక్తులు సమర్పించారు. మల్లెలు, గులాబీలు, జాజులు, లిల్లీ, సంపంగి, చామంతులు, తులసి, బిల్వ, ధవనం, మరువం తదితర పత్రాలు భక్తులు స్వామికి సమర్పించారు. అనంతరం 108 కలశాలతో స్వామికి అభిషేకం చేశారు. ఉదయం 7 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం, అష్టోత్తర శత రజత కలశ గంధోదక అభిషేకం, పుష్పాంజలి నిర్వహించారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఎంవీపీ ఎస్ఐ ఖాదర్ బాషాకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆయన బుధవారం 11 గంటల సమయంలో అప్పుఘర్ శ్మశానవాటిక వద్దకు వెళ్లగా.. అక్కడ ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. యువకులు పరారవ్వడానికి పరిగెట్టారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వేణు అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకొచ్చి కమీషన్ కోసం విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. నక్కవానిపాలేనికి చెందిన బొర్రా వేణుబాబు, యెరుష మహేష్, కేఆర్ఎం కాలనీకి చెందిన బక్కా మనోజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో లక్ష్మీ హోమం


ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీచక్ర నవ వర్ణార్చన, లక్ష్మీ హోమం జరిపారు. ఈ పూజలో నలుగురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608 10011006681, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును endoweokanaka @gov.in మెయిల్‌కు పంపాలి. లేదా aptemples. ap.gov.inలో నమోదు చేసుకోవచ్చు.

బడికి వేళాయె..

- నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- ముగిసిన వేసవి సెలవులు


స్కూల్ బ్యాగ్ కొంటున్న విద్యార్థి తండ్రి


ప్రైవేటు స్కూల్ విద్యార్థులకు యూనిఫారాలు కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

సీతంపేట: వేసవి సెలవులు ముగిశాయి. ఆటపాటలతో సుమారు 49 రోజుల పాటు హాలీడేస్ ఉత్సాహంగా గడిపిన చిన్నారులు మళ్లీ బడిబాట పట్టనున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. పుస్తకాలతో కుస్తీ మొదలుకానుంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలకు అవసరమైన స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, వాటర్ బాటిల్, స్నాక్‌బాక్స్, షూష్, యూనీఫారం, పుస్తకాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. బుక్స్ అండ్ స్టేషనరీ దుకాణాల్లో విద్యా సామగ్రి కొనుగోళ్లతో రద్దీ నెలకొంది.

సిద్ధమైన పాఠశాలలు, విద్యార్థులు

కొత్త విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతన్న విద్యార్థులకు గురువారం నుంచి బోధనకు పాఠశాలలు సిద్ధమయ్యాయి. నియోజకవర్గంలోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సీతంపేట జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరస తెలిపారు. తరగతి గదులు డెస్క్ బెంచీలు, పాఠశాల ఆవరణ, టాయిలెట్లు, వాష్ బేసిన్లను శుభ్రం చేయించినట్టు చెప్పారు. పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, బెంచీలు అన్ని వసతులు పాఠశాలలో సమకూర్చినట్టు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీలతో దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కొత్తవారు వచ్చారని, దీంతో ఆయా పాఠశాల పరిస్థితి, విద్యార్థులపై అవగాహన రావడానికి కొంత సమయం పడుతుందన్నారు.

మందకొడిగా విద్యార్థుల అడ్మిషన్లు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ప్రస్తుతం మందకొడిగా సాగుతున్నాయి. గురువారం నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థుల నమోదు పెరుగుతుందని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. పదో తరగతి నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల స్థానంలో కొత్తవారిని ఇప్పటికే చేర్చుకున్నామని మాధవధార హైస్కూల్ హెచ్‌ఎం బి.హేమలత, కె.కాలనీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎం సాయిలక్ష్మి తెలిపారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

మాధవధార, బర్మా కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్చారు. వీటికి పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరయ్యాయి. మాధవధార పాఠశాలకు ఇప్పటికే పనిచేస్తున్న ఎస్.పెద్దినాయుడు పీఎస్ హెచ్‌ఎంగా కొనసాగుతారు. ఇక్కడ పనిచేస్తున్న కె.వసంత కుమారి పదోన్నతిపై పీఎస్ హెచ్‌ఎంగా బర్మా కాలనీ పాఠశాలకు నియమితులయ్యారు.

- మాధవదార, కె.కాలనీ హైస్కూళ్లలో రీ అపోర్షన్ అంటే సెక్షన్‌కు 49 మంది విద్యార్థులుగా లెక్కించినందున కొన్ని పోస్టులు పెరిగాయి. మాధవదారలో 15 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. 20 మంది వచ్చారు. ఫిజికల్ టీచర్ పోస్టులో ఒకటి సర్‌ప్లస్ పోగా 3 పోస్టులు ఉన్నాయి.
- కె.కాలనీ ఉన్నత పాఠశాలలో రీ అపోర్షన్ ద్వారా తెలుగు, సోషల్, పీడీ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున పెరిగాయి. పీడీ పోస్టులు రెండున్నాయి. ఒకరు ఇంకా చేరాల్సి ఉందని హెచ్‌ఎం చెప్పారు.



మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల


మధురానగర్ స్కూల్‌లో సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

'బీసీలు రాజకీయాల్లోకి రావాలి'


మాట్లాడుతున్న పార్టీ నేషనల్ కో ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు

సీతంపేట: బీసీలందరూ రాజకీయాల్లోకి రావాలని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ నేషనల్ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ జె.పూర్ణచంద్రరావు ఆకాంక్షించారు. డైమండ్ పార్క్ సమీపంలో బుధవారం నూతనంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు బీసీల హక్కులు, సాధన కోసం మారాల్సిన అవసరం ఉందన్నారు. ఒక పార్టీ జెండా పట్టుకుంటే ఎప్పటికీ వెనకే ఉండిపోతామన్నారు. ముస్లిం బీసీల సమస్యలను మనమే ఎజెండాగా ఎంచుకుని మాట్లాడటం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేసిన వారమవుతామని చెప్పారు. నలుపు రంగు చొక్కా నిరసన ద్వారా మన భావజాలాన్ని, మన సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీల సమస్యలను మనమే గొంతెత్తి చెప్పేలా ఏఐ బీఎస్పీ ముమ్ముందు పోరాడుతుందని తెలిపారు. మన సమస్యలను మనమే పరిష్కరించుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పెరియార్ మార్గంలో పయనించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కె.లక్ష్మి, రాష్ట్ర నాయకులు వై.శారద, ముస్లిం నాయకుడు అబ్దుల్ మనస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ, ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తపై అవగాహన


స్థానికులకు చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్ 137 సచివాలయం పరిధి కనకమ్మవారి గుడి వీధిలో చెత్తపై జీవీఎంసీ, శానిటరీ విభాగాల సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడిచెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను ప్రతిరోజు విభజించి ఇంటి వద్దకు వస్తున్న క్లాప్ వాహనాలకు అందించాలని కోరారు. ఇలా విభజించడంలో ప్రయోజనాలు తెలిపారు. అదే విధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై షాపుల వారికి, తోపుడు బళ్ల వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు, అడ్మిన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఏకాహం

మురళీనగర్: స్థానిక రామాలయంలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా నెల రోజులు ముందుగా నిర్వహించే సాయినాథుని ఏకాహం బుధవారం విజయవంతంగా ముగిసింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు అఖండ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సాయి నామ స్మరణ చేశారు. ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, సనపల వరపరసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో పౌర్ణమి వేడుకలు జూలై 10 నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

గొప్ప లీడర్ మోదీ


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

మద్రిపాలెం: ప్రపంచ దేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప లీడర్ అని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ కొనియాడారు. బిర్లా జంక్షన్ సమీపంలోని బొత్స కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రధాని తన ఆలోచనలకు అనుగుణంగా వక్ఫ్ బిల్లు ప్రవేశపెట్టారని, వన్ నేషన్ - వన్ ఎలక్షన్ తీసుకొచ్చారన్నారు. మూడో సారి మోదీ అధికారంలోకి వచ్చాక మెజారిటీ సరిగ్గా లేదని, ఇతర పార్టీలకు లొంగిపోతారని చాలా మంది అన్నారని, అందుకు భిన్నంగా ఆయన పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ స్మార్ట్ సిటీగా విశాఖకు రూ.2,500 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లల వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలి

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గొండు సీతారాం కోరారు. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ.వాణిని బుధవారం ఆయన సత్కరించారు. వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో పిల్లల వైద్యం కోసం ప్రత్యేక బెడ్లు, వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఫోరం కోరినట్లు బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామని వాణి అన్నారు.

పల్లా శ్రీనివాసరావుకు పరామర్శ


పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్

సీతంపేట: రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పరామర్శించారు. సీతంపేటలోని ఆయన నివాసానికి వెళ్లి ఇటీవల మరణించిన తండ్రి పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పల్లా శ్రీనివాసరావును, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

మన పొట్ట.. కాదు చెత్తబుట్ట

- ఆరోగ్యకరమైన ఆహారమే తీసుకుందాం
- ఏరువాక పౌర్ణమి వేడుకల్లో గ్రీన్ క్లైమేట్ టీం


150 ఏళ్ల మర్రిచెట్టు వద్ద ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీం, పలు సంస్థల ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఏరువాక పౌర్ణమి కేవలం ఒక పండగ మాత్రమే కాదు.. ఇది మనం తినే ఆహారం ద్వారా అందరినీ ఏకం చేసే ఉత్సవమని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ మార్గంలోని సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి సీటీజీ, మన కూరగాయల తోట వంటి పలు సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జె.వి.రత్నం మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పండించిన పంటల ద్వారా లభించే దేశీయ విత్తనాలను ఇచ్చిపుచ్చుకునే ప్రాచీన సంప్రదాయాన్ని తిరిగి కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలు పండించాలని, అటువంటి ఆహారాన్నే తీసుకోవాలని కోరారు. 'మన పొట్ట చెత్తబుట్ట కాదు' అని గుర్తుచేస్తూ.. ప్యాకెట్లలో లభించే ప్రాసెస్డ్ ఆహారాన్ని దూరంగా ఉంచాలని సూచించారు. వనమాలి సీటీజీ గ్రూపుల అడ్మిన్ మళ్ల సరిత మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారిత కూరగాయలను పండించుకుంటూ, వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, పెందుర్తి హాస్టల్ వార్డెన్ సత్య, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ.కృష్ణకుమారి, అరవల అరుణ, జె.రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయిని పంతుల లలిత తదితరులు పాల్గొన్నారు.